జగన్ పాలనలో అందరికీ సంక్షేమం

– గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

సంబేపల్లె : జగనన్న పాలనలో సంక్షేమ విప్లవం కొనసాగుతోందని అన్నమయ్య జిల్లా వైఎస్‌ఆర్‌సీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని రౌతుకుంట గ్రామంలోని బాటవారిపల్లె, కుమ్మరపల్లె, ఆర్.పోతువాండ్లపల్లె, వంకవార హరిజనవాడలలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వంలో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి గడపకు ఆయన వెళ్లి సమస్యలపై ఆరా తీయడంతోపాటు ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. జగన్ ప్రభుత్వంతో అందరికీ సంక్షేమ పథకాలు ఎమ్మెల్యేకు సమాధానమిచ్చారు. మరింత మెరుగైన పాలన అందించేందుకు, ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి సత్వర పరిష్కారానికి గడప గడపకు కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగన్ పాలన సాగుతోందన్నారు. ఎన్నికల్లోని మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో దేశంలోనే ఆదర్శంగా సీఎం జగన్ నిలుస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగశ్రీలక్ష్మి, మాజీ జెడ్పీటీసీ ఉపేంద్రనాథరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ వడ్డి వెంకటరమణారెడ్డి, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, నూర్ అహమ్మద్, ఎంపీటీసీ భద్రయ్య, హరీష్‌రెడ్డి, తహసీల్దార్ మహేశ్వరీబాయ్, ఎంపీడీఓ నరసింహులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సెర్ప్ ఉద్యోగుల సంక్షేమానికి కృషి

రాయచోటి : మహిళా పక్షపాతి సీఎం జగన్‌మోహన్ రెడ్డి అని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం రాయచోటి నియోజకవర్గంలోని సెర్ప్ వైఎస్‌ఆర్ క్రాంతి పథం ఉద్యోగుల ఆత్మీయ సమావేశాన్ని పట్టణంలోని క్రాంతి పథం కార్యాలయంలో నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మహిళలను లక్షాధికారులను చేయాలని దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ఆర్ హయాంలో పావలా వడ్డీ కింద రుణాలు అందించారన్నారు. వెలుగు పథకం సృష్టికర్త తానే అని చెప్పుకునే చంద్రబాబు అటు సంఘాల మహిళలకు, అందులో పనిచేస్తున్న సిబ్బందికి మేలు చేసిందేమీ లేదన్నారు. అదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పథకంలో పనిచేసే ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. అనంతరం సెర్ప్ ఉద్యోగులతో కలిసి సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. తదుపరి సెర్ప్ ఉద్యోగులు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో హబీబుల్లాఖాన్, కౌన్సిలర్ గౌస్‌ఖాన్, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, డీపీఎంలు వేణుమాధవ్, లక్ష్మీప్రసాద్‌రెడ్డి, ఏరియా కో–ఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డి, సంజీవరాజు, ఆనంద్‌బాబు పాల్గొన్నారు.



సంబేపల్లె: వృద్ధురాలికి పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



జేసీఎస్ నమోదు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

రాయచోటి : అర్హులందరికీ సంపూర్ణంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఫయాజ్ కల్యాణ మండపంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సచివాలయ కన్వీనర్ల (జేసీఎస్)కు బీమా నమోదు శిబిరంలో ముఖ్య అతిథిగా శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం అందిస్తున్న పథకాలను విస్తృతంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తీసుకెళ్లాలన్నారు. నియోజకవర్గంలోని 98 సచివాలయాలకు గాను నేటికి 84 సచివాలయాల పరిధిలో 85 వేల గృహాలను సందర్శించడం జరిగిందన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందడంపై ప్రజలు ప్రభుత్వంపై ఎంతో సానుకూలంగా ఉన్నారన్నారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో 34వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారని, సీఎం జగన్ మోహన్ రెడ్డి 2.30 లక్షల శాశ్వత ఉద్యోగాలను కల్పించడం ఒక రికార్డు అన్నారు. చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్‌లు జగన్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకనే విమర్శలు చేస్తున్నారన్నారు. చంద్రబాబుకు ప్రకృతి కూడా సహకరించదన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులము ఒకతాటిపై నడుద్దామని శ్రీకాంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పార్టీకి ప్రజల మద్దతు ఉందన్నారు. సచివాలయ కన్వీనర్, జీసీఎస్ గృహ సారథులకు రూ. 10 లక్షల బీమా సౌకర్యాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కల్పించిందన్నారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు తనకు అన్ని వేళలా అండగా ఉన్నారని, పదిహేనేళ్లపాటు గుండెల్లో పెట్టుకున్నారని, మీ మేలు మరువలేనన్నారు. వారి రుణం తీర్చుకుంటానన్నారు. గ్రూపులు, వర్గాలు వద్దని కలిసి పని చేద్దామన్నారు. ప్రాణం పోయినా తప్పు చేయనని శ్రీకాంత్ రెడ్డి స్పష్టం చేశారు. అనంతరం సంబేపల్లె ఎంపీపీ ఆవుల నాగశ్రీ లక్ష్మి, పార్టీ పరిశీలకులు కరీముల్లా, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిదంబర్ రెడ్డిలు మాట్లాడుతూ జగనన్న అందిస్తున్న సంక్షేమ పాలనను కొనియాడారు.

వ్యక్తిగత దూషణలు చేసినా సహనంగా ఉందాం

ప్రతిపక్ష పార్టీ నాయకులు మనపై వ్యక్తిగత దూషణలు చేసినా వారి విజ్ఞతకు వదిలి సహనంగా ఉందామని శ్రీకాంత్ రెడ్డి సూచించారు. తమ హయాంలో రౌడీయిజాన్ని ప్రోత్సహించలేదన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ప్రజలకు అండగా ఉందామన్నారు. మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, జెడ్పీటీసీలు వెంకటేశ్వరరెడ్డి, మానస వెంకటరమణ, మదనపల్లె పరిశీలకులు హబీబుల్లా ఖాన్, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రుడికి పల్లకీ సేవ



పల్లకీలో ఊరేగుతున్న భద్రకాళి సమేతుడు

రాయచోటి టౌన్ : భద్రకాళి సమేతుడు వీరభద్ర స్వామికి పల్లకీ సేవ నిర్వహించారు. సోమవారం రాత్రి స్వామి వారు, అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అనంతరం ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డిల ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులను అందంగా అలంకరించి పల్లకీలో ఉంచి ఆలయ మాఢ వీధులలో ఊరేగించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచి పెట్టారు.

గోవులను కాపాడండి



పుల్లంపేటకు చేరుకున్న గో మహా పాదయాత్ర బృందం

పుల్లంపేట : అఖిల భారత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గో మహా పాదయాత్ర సోమవారం పుల్లంపేటకు చేరుకుంది. ఈ నెల 6న హైదరాబాదు నుంచి తిరుమలకు చేరుకొని అక్కడి నుంచి అరుణాచలానికి బయలుదేరనున్నారు. రాధక్రిష్ణ గురుస్వామి చేపడుతున్న ఈ పాదయాత్ర బృందాన్ని విశ్వ హిందూ పరిషత్ మండల నాయకులు ఘన స్వాగతం పలికారు. రెడ్డిపల్లి చెరువుకట్ట వద్ద పాదయాత్ర బృందం విశ్రాంతి తీసుకుంటున్నారు.

క్లుప్తంగా

వీధిలైట్ల సమస్య పరిష్కారం

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని గుర్రప్పపాళెం ఎస్టీ కాలనీలో వీధి లైట్లు లేక గ్రామస్తులు అవస్థలు పడేవారు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ జాషువా సోమవారం సాయంత్రం కల్లా గుర్రప్పపాళెం ఎస్టీకాలనిలో వీధి లైట్లు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు. కాగా అంతకుముందు సమస్యను పరిష్కరించాలని కోరుతూ బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు పండుగోలు మణి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. సమస్య పరిష్కరించడంతో గ్రామస్తులు అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

నాగపంచమి వేడుకలు



పుట్టకు పూజలు చేస్తున్న మహిళలు

రాజంపేట టౌన్ : నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం నాగపంచమి వేడుకలను మహిళలు ఘనంగా జరుపుకున్నారు. వేకువజాము నుంచే మహిళలు పెద్దఎత్తున పుట్టల వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అనేక మంది తొలుత పుట్టలకు ఒక్కపొద్దు చెప్పి అనంతరం నాగదేవతకు నైవేద్యాలు తీసుకొచ్చి ఒక్క పొద్దులు చెల్లించుకున్నారు. పూజల సందర్భంగా మహిళలు పుట్టల చుట్టూ దారం చుట్టి అనంతరం పుట్టల్లో పాలు పోశారు. ప్రత్యేక పూజల కోసం మహిళలు పుట్టల వద్దకు తరలివెళ్లడంతో ఆయా ప్రాంతాల్లో సందడి కనిపించింది.

చిన్నమండెం : మండల వ్యాప్తంగా ఉన్న పలు ఆలయాలలో శ్రావణ మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా నాగుల పంచమిని పురస్కరించుకుని ఆలయాల్లోని నాగులకట్ట వద్ద మహిళలు పూజలు చేశారు. పుట్టల వద్ద మహిళలు పాలు పోసి తమ భక్తిని చాటుకున్నారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

సమస్యలు పరిష్కరించండి

పుల్లంపేట : స్పందన ద్వారా వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దారు నరసింహకుమార్ తెలిపారు. సోమవారం స్పందన ద్వారా ఆరు అర్జీలు అందాయని వాటిని సంబంధించిన అధికారులకు బదిలీ చేశామన్నారు. వీఆర్‌ఓలు సచివాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ రెవెన్యూకు సంబంధించిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. సరైన గడువులోగా ఆన్‌లైన్ సమస్యలను పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ నవీన్‌కుమార్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

సిద్దవటం : ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ లక్ష్మినారాయణ తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో సోమవారం ఎస్ఐ మాట్లాడుతూ సిద్దవటం మండలంలోని రౌడీషీటర్లు, అసాంఘిక కార్యకాలపాలకు పాల్పడేవారిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట, జూదం, మట్కా వంటివి ఆడుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అంతేగాకుండా ఎర్రచందనం, ఇసుక అక్రమ రవాణాలను నిరోధించేందుకు ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని ఆయన అన్నారు.

సచివాలయం తనిఖీ

రైల్వేకోడూరు : సచివాలయం పరిధిలో దరఖాస్తు రూపంలో వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించాలని జెడ్పీటీసీ రత్నమ్మ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని వీవీఆర్ కండ్రిగ సచివాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం సచివాలయం అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల సచివాలయ పరిధిలోని లక్ష్మీపురం, లక్ష్మీగార్డెన్స్, దేశెట్టిపల్లి, సిద్ధేశ్వరపురం, కమలానగర్ ఎస్టీ కాలనీలలో పర్యటించానని, అక్కడ గ్రామస్తులు కొంతమంది చిన్నపిల్లలకు ఆధార్‌కార్డులు లేవని, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ పింఛన్, కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని తమ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. తక్షణం స్పందించి వలంటీర్ల ద్వారా వివరాలు సేకరించి సమస్యలను పరిష్కరించాలని తెలియజేశారు.

ఎక్సలెన్స్ అవార్డుకు బాలికల ఎంపిక

రాయచోటి టౌన్ : సాంస్కృతిక నృత్య ప్రదర్శనలో చూపిన ప్రతిభకు గాను ఎక్సలెన్స్ అవార్డుకు రాయచోటికి చెందిన ముగ్గురు విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈ నెల 19వ తేదీ తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో నిర్వహించిన ఈ పోటీలలో రాయచోటి పట్టణానికి చెందిన నలుగురు విద్యార్థినులు విశేష ప్రతిభ కనబరచగా వారిలో ముగ్గురు విద్యార్థినులు హేమశ్రీ, సరవి, ఉమా దుర్గావతిలు ఎంపిక కావడం విశేషం. వీరు ముగ్గురు ఇది వరకే ఇంటర్నేషనల్ వండర్ బుక్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌ను సాధించారు. వీరిని ఆయా విద్యాసంస్థలకు చెందిన ఉపాధ్యాయులు ఒకే వేదికపై ఘనంగా సన్మానించారు.

ఆర్టీసీ ఖాళీ స్థలాలకు టెండర్లు

మదనపల్లె సిటీ: ములకలచెరువు ఆర్టీసీ బస్టాండువద్దనున్న ఖాళీ స్థలాలకు టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9959225676, 7382874704ను సంప్రదించాలని కోరారు.

అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం

పెనగలూరు : గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం గతంలో రూ. 1.60 కోట్లను మంజూరు చేసినట్లు వైస్ ఎంపీపీ కొండూరు విజయ్‌రెడ్డి తెలిపారు. ఈ విషయమై ఆయన సోమవారం సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో ఎంపీడీఓ సభా భవనంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ నిధులపై ఒక్కొక్క అధికారితో రివ్యూ నిర్వహించి పనులు ఎంతవరకు జరిగాయని ఆరా తీశారు. మండలంలో 14 సచివాలయాలు ఉండగా 8 సచివాలయాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించామన్నారు. సచివాలయ పరిధిలో అత్యవసరమైన పనులు గుర్తించి వాటికై నిధులు కేటాయించామన్నారు. ఒక్కొక్క సచివాలయానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూ. 20 లక్షలు కేటాయించారన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు కేవలం మూడు పనులు మాత్రమే కేటాయించామని, మిగిలినవన్నీ రోడ్లు పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేశామన్నారు. ఇప్పటికే 9 రోడ్లను పూర్తి కాగా, మిగిలినవి వివిధ దశలలో ఉన్నాయన్నారు. సచివాలయ సిబ్బంది, పాలకులు, పంచాయతీకి కేటాయించిన రూ. 20 లక్షల నిధులతో చేపట్టే పనులను వేగవంతం చేయాలన్నారు. లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశం జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్ రావు, ఎంపీడీఓ వరప్రసాద్, ఏఓ పద్మభూషన్ రెడ్డి, వివిధ శాఖలకు చెందిన అధికారులు, సచివాలయ సిబ్బంది, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

తండ్రి స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు

నందలూరు(రాజంపేట) : మాజీ మంత్రి పసుపులేటి బ్రహ్మయ్య స్ఫూర్తితో సేవా కార్యక్రమాలను చేపడతానని ఆయన తనయుడు పసుపులేటి ప్రదీప్ అన్నారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే వర్ధంతి సందర్భంగా ఆడపూరు ముక్తి కనుమ వద్ద ఉన్న పరిపూర్ణ సత్సంగ ఆశ్రమంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా తండ్రి పేదలకు సేవ చేయడమే లక్ష్యంగా రాజకీయ జీవితాన్ని కొనసాగించారని, తాను తన సోదరుడు పసుపులేటి పవన్ కుమార్ అదే బాటలో నడుచుకుంటామన్నారు. అనంతరం ప్రదీప్ ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి సృజన, వైద్యుడు చంద్రశేఖర్‌రెడ్డి చేతులమీదుగా రోగులకు పండ్లను పంపిణీ చేశారు. బ్రహ్మయ్య చిత్రపటానికి నివాళి అర్పించారు. మాజీ ఎంపీపీ ఎద్దల వెంకటేశ్వర్లు, బ్రహ్మయ్య వర్గీయులు పసపులేటి చంద్రశేఖర్, ప్రతాప్, వీరయ్య, మధు పాల్గొన్నారు.



నందలూరు పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న పసుపులేటి ప్రదీప్

ఆడుదాం ఆంధ్రలో సత్తా చాటాలి

సిద్దవటం : ఆడుదాం ఆంధ్ర పోటీల్లో మండలానికి మంచి పేరు ప్రఖ్యాతలు తేవాలని మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో సోమవారం మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీడీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర పోటీలకు ఎంఈఓ శంకరయ్య కన్వీనర్‌గా వ్యవహరిస్తారన్నారు. గ్రామ స్థాయిలో పీడీలు క్రికెట్ ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ టీమ్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండలంలోని 5 క్లస్టర్‌ల నుంచి 5 పురుషుల జట్లు, 5 మహిళల జట్లు ఉంటాయన్నారు. అక్టోబర్ 2వ తేదీ నుంచి ఈ పోటీలను నిర్వహిస్తారన్నారు.

పక్కా గృహాలను త్వరితగతిన పూర్తి చేయండి

మండలంలోని పక్కా గృహాల లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్‌రెడ్డి అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని పక్కాగృహాలపై ఆయన సమీక్షించారు. మండలానికి 1,116 గృహాలు మంజూరు కాగా అందులో దాదాపు 600 గృహాలు పూర్తయ్యాయన్నారు. 500 గృహాలు వివిధ స్థాయిలో ఉండగా, వాటిలో 360 గృహాలు బీఎల్ స్థాయిలో ఉన్నాయన్నారు. ఆయా గృహాలను స్టేజీల వారీగా వారానికి 42 గృహాలు చొప్పున పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించామన్నారు. ఎంపీడీఓ జవహర్‌బాబు, తహసీల్దారు లక్ష్మిదేవి, ఇన్‌చార్జి హౌసింగ్ ఏఈ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సమతుల ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

సంబేపల్లె : సమతుల ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని జిల్లా సైన్స్ అధికారి ఓబుల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రోటీన్లు, పిండి పదార్థాలు, కొవ్వులు, విటమిన్లు, ఖనిజ లవణాలు, పీచు పదార్థాలు, నీరు అవసరమైన మోతాదులో తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు తక్కువగా తీసుకున్నప్పుడు విటమిన్‌లు, ఖనిజ లవణాల కొరత ఏర్పడుతుందన్నారు. విద్యార్థి దశలో అభ్యాసనాభివృద్ధి సక్రమంగా జరగాలంటే సమతుల ఆహారం తీసుకోవడమే సరైన మార్గమని తెలిపారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసమే పోషకాహారంతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

రాయచోటి అర్బన్ : తమ గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలంటూ లక్కిరెడ్డిపల్లె మండలం కాకులారం గ్రామ పంచాయతీ కొత్తరాచపల్లె వాసులు సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ రాయచోటి ఏరియా కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా కొత్తరాచపల్లెలో 60 కుటుంబాలు జీవిస్తున్నాయన్నారు. గ్రామంలోని చేతిపంపు బోరు తగుమేర తాగునీరందివ్వలేక పోతోందన్నారు. దీంతో గ్రామస్తులు కూలీ పనులను మానుకుని బిందెలతో వ్యవసాయ బోర్ల దగ్గరకు పరుగులు తీయవలసి వస్తోందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని గ్రామంలో దాహార్తిని శాశ్వతంగా తీర్చాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు వెంకటేశు, నరసింహులుతోపాటు కొత్తరాచపల్లె ప్రజలు పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపును సద్వినియోగం చేసుకోండి

సిద్దవటం : మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జవహర్‌బాబు తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఆధార్ స్పెషల్ క్యాంపులను నిర్వహిస్తున్నామన్నారు. 22, 23 తేదీలలో సిద్దవటం, 24వ తేదీ పెద్దపల్లి, 25వ తేదీ మాధవరం–1 గ్రామ సచివాలయాల్లో ఈ ఆధార్ ప్రత్యేక క్యాంపులను నిర్వహిస్తునట్లు ఎంపీడీఓ తెలిపారు.

డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయాలి

పుల్లంపేట : 2023 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిర్దిష్ట లక్ష్యాన్ని పూర్తిచేయాలని ఏపీఎం సుబ్బలక్షుమ్మ తెలిపారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో వీఓఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుల్లంపేట మండలవ్యాప్తంగా 687 సంఘాలున్నాయని, ప్రతి సంఘం పొదుపును క్రమం తప్పకుండా చెల్లించుకోవాలన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలను పొందాలన్నారు. సీసీలు సుబ్బయ్య, ఆచార్య, మండల సమాఖ్య సభ్యురాలు పాల్గొన్నారు.

ఉచిత అంబులెన్స్ సర్వీసు ప్రారంభం

రైల్వేకోడూరు : రైల్వేకోడూరు గ్రేసి హ్యాండ్స్ ట్రస్ట్ అధ్యక్షుడు అమర్‌నాథ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత అంబులెన్స్ సర్వీసును డాక్టర్ బ్రహ్మకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలను దృష్టిలో పెట్టుకుని ప్రజలకు అందుబాటులో ఉచితంగా అంబులెన్స్ సేవలు అందించాలనుకోవడం చాలా గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో రాధాక్రిష్ణ, నగిరిపాటి చంగయ్య, తుమ్మల సురేష్, చంద్రపాల్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

24న చలో విజయవాడ

రాజంపేట : మున్సిపాలిటీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 24న చలో విజయవాడ కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్ తెలిపారు. సోమవారం మున్సిపాలిటీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డికి వినతి సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సీహెచ్ ఓబయ్య, ప్రసాద్, లక్ష్మీదేవి, ఎం.రమణ, రవిశంకర్, మల్లేష్ పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌యూ రాష్ట్రసదస్సును జయప్రదం చేయండి

రాయచోటి అర్బన్ : గుంటూరు అంబేడ్కర్ భవన్‌లో సెప్టెంబరు 7, 8తేదీలలో జరిగే ఆర్‌ఎస్‌యూ రాష్ట్రస్థాయి సదస్సును జయప్రదం చేయాలని ఆ సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రశాంత్ కోరారు. సోమవారం స్థానిక దివ్యతేజ పాఠశాలలో ఆర్‌ఎస్‌యూ రాష్ట్రస్థాయి సదస్సు పోస్టర్‌ల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'విద్యను కాపాడుకుందాం – దేశాన్ని రక్షించుకుందాం' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో రాయచోటి ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ నేత నాగేశ్వరరావు, ఆర్‌ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఓబులవారిపల్లె : కొర్లకుంట పంచాయతీ చల్లెంపాల్లెం గ్రామానికి చెందిన గూడూరు రాజేష్‌రాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి రేణిగుంట ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సోమవారం ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి, ఎల్లాయపల్లె సర్పంచ్ జరుగు నారాయణ రెడ్డి చికిత్స పొందుతున్నా రాజేష్ రాజును పరామర్శించి, కుటుంబానికి సాయికిషోర్‌రెడ్డి రూ. 50 వేల ఆర్థికసాయం అందించారు. ఎంపీటీసీ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత జయన్న మృతి

నందలూరు(రాజంపేట) : వైఎస్సార్‌సీపీ నేత కుందానెల్లూరు జయన్న (లక్కిరెడ్డి జయప్రకాశ్ ఆదినారాయణరెడ్డి) (73) సోమవారం మృతి చెందారు. గత కొద్దిరోజులుగా ఆయన అనారోగ్యంతో తిరుపతి నారాయణాద్రిలో చికిత్స పొందుతున్నారు. మృతదేహాన్ని స్వగ్రామం కుందానెల్లూరుకు తీసుకొచ్చారు. జయన్న వైఎస్సార్‌సీపీ తరఫున స్థానిక సంస్థల ఎన్నికల్లో తొలి ఎంపీటీసీగా ఏకగ్రీవంగా గెలిచి గుర్తింపు పొందారు. ఈయన భార్య కరోనాలో మృతి చెందగా, ఇద్దరు కుమారులున్నారు. జయన్న అంత్యక్రియలు మంగళవారం ఉదయం నిర్వహించనున్నట్లు ఆయన సోదరుడు వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

– గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

ఓబులవారిపల్లె : ప్రజా సంక్షేమమమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం బొమ్మవరం సచివాలయ పరిధిలోని బీపీ రాచపల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమన్ని కొరముట్ల ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి అధికారులతో కలిసి నిర్వహించారు. బీపీరాచపల్లె సర్పంచ్ నరేంద్రరాజు గజమాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కొరముట్ల శ్రీనివాసులు గ్రామంలో ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వార ఎంత మేర లబ్ధి చేకూరిందో వివరించారు. ప్రతి ఇంటి వెళ్లి ఆప్యాయంగా పలకరించి సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా విద్యుత్, పక్కా గృహాలు, రోడ్లు, పింఛన్‌లకు సంబంధించి ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వ విప్ దృష్టికి తీసుకొచ్చారు. ఆయన వెంటనే సంబంధిత శాఖ అధికారులు పిలిచి వెంటనే సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను పరిశిలించారు. పాఠశాలలో జరుగుతున్న నాడు – నేడు పనులను పరిశీలించారు. పాఠశాలకు సంబంధించిన విషయాల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకొన్నారు. పాఠశాలకు సంబంధించి భూమిని సర్వే చేయించాలని నాడు – నేడు పనులు జరుగుతున్నందన వెంటనే చర్యలు తీసుకోవాలని సర్పంచ్ నరేంద్రరాజు ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులును కోరారు. ఇందుకు ఆయన వెంటనే స్పందించి తహసీల్దార్ పుల్లారెడ్డిని పిలిచి సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం చిన్నరాసపల్లె గ్రామంలో సీసీ రోడ్డుకు పూజలు నిర్వహించి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ నరేంద్రరాజు, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు టి.కృష్ణరెడ్డి, వక్ఫ్ బోర్డు జిల్లా డైరెక్టర్ సుంకేసుల రఫీ, తహసీల్దార్ పుల్లరెడ్డి, ఎంపీడీఓ విజయారావు, ఎల్లాయపల్లె సర్పంచ్ జరుగు నారాయణరెడ్డి, స్థానిక నాయకులు మోహన్‌నాయుడు, వైస్ సర్పంచ్ పి.సుబ్రమణ్యం, గంగరాజు, రామచంద్రరాజు, మల్లేశ్వరమ్మ, గిరిజమ్మ, మహేష్‌నాయుడు అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలను వివరిస్తున్న కొరముట్ల శ్రీనివాసులు

మానవతా విలువలు నేర్పుతూ సమాజ సేవ

రాయచోటి టౌన్ : మానవ సేవే మాధవ సేవగా మానవత సంస్థ పని చేస్తోందని అర్బన్ సీఐ సుధాకర్ రెడ్డి అన్నారు. సోమవారం రాయచోటి పట్టణంలోని ప్రతిభా జూనియర్ కళాశాల నుంచి మానవత సేవా సంస్థ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, చైర్మన్ అరమాటి శివగంగిరెడ్డి ఆధ్వర్యంలో ఆ సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శాంతి ర్యాలీని విద్యార్థులతో కలసి నిర్వహించారు. ర్యాలీలో సంస్థ ఉపాధ్యక్షులు సంచుల ఖాదర్ బాషా, సెక్రటరీ రామానాయుడు, ట్రెజరర్ రెడ్డెప్పరెడ్డి, వెంకటరమణ, సహదేవరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, షకీల్, జయచంద్రారెడ్డి, తులసీశ్వరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, వీరయ్య, రాజశేఖర్‌రెడ్డి, నాగభూషణం, రిటైర్డ్ ఎంఈఓ వీసీ రెడ్డన్న తదితులు పాల్గొన్నారు.

పనులు నాణ్యతతో చేపట్టండి

ఓబులవారిపల్లె : పాఠశాలలో నాడు – నేడు కింద చేస్తున్న పనులను నాణ్యతతో చేయాలని ముఖ్యమంత్రి సలహాదారు రక్కాసి ధనుంజయరెడ్డి అన్నారు. సోమవారం ఆయన గాదెల పంచాయతీ తల్లెంవారిపల్లె జెడ్పీహెచ్‌ఎస్‌లో చేపడుతున్న నూతన భవనల పనులను పరిశీలించారు. పనులను వేగవంతంగా పూర్తయ్యేలా చూడాలని పాఠశాల సిబ్బందికి ఆదేశించారు. అనంతరం పాఠశాలలోని మధ్యాహ్న భోజనం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఉన్నత స్థాయి బోధనను అందించి, వారి భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. ఇందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షాహిదుల్లా, ఉపాధ్యాయులు రవికుమార్, నాయకులు నాగినేని రమేష్‌నాయుడు, గ్రామస్తులు చిన్నిరెడ్డి గురివిరెడ్డి, అమర్‌నాథరెడ్డి, ఆశోక్‌రెడ్డి, భాస్కర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ముజఫర్ తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ధనుంజయరెడ్డి

'దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీపై చర్యలు తీసుకోండి'

రాయచోటి అర్బన్ : దివ్యాంగుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్న జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ కిషోర్‌బాబుపై చర్యలు తీసుకోవాలని జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వంగిమళ్ల రంగారెడ్డి కలెక్టర్ గిరీషా పీఎస్‌కు విన్నవించారు. సోమవారం ఆయన స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌ను కలుసుకున్నారు. ఈ నెల 17న రాయచోటి బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో దివ్యాంగులకు ఉపకరణ పరికరాల కొలతల సేకరణ శిబిరంను నిర్వహించారన్నారు. నియోజకవర్గంలోని 6 మండలాల నుంచి విచ్చేసిన దివ్యాంగులందరికి ఒకే ఒక కౌంటర్‌ను ఏర్పాటు చేయడంతో దివ్యాంగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయమై తాను కొందరితో కలసి ఏడీని ప్రశ్నించామన్నారు. అందుకు ఆయన తమపట్ల దురుసుగా వ్యవహరించడంతోపాటు దుర్భాషలాడారంటూ కలెక్టర్‌కు తెలిపారు. దివ్యాంగుల పట్ల చులకన భావంతో వ్యవహరిస్తున్న ఏడీపై చర్యలు తీసుకోవాలంటూ ఆయన కలెక్టర్‌కు విన్నవించారు.

మహా సభలకు హాజరైన ఎన్జీఓ నేతలు

లక్కిరెడ్డిపల్లె : ఆగస్టు 21, 22వ తేదీలలో విజయవాడలో జరిగే ఏపీఎన్జీఓ 21వ రాష్ట్ర మహాసభలకు ఏపీ ఎన్జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.ప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లా లక్కిరెడ్డిపల్లె తాలుకా యూనిట్ నుంచి ఆదివారం రాత్రి ప్రత్యేక బస్సులో బయలుదేరి విజయవాడకు వెళ్లారు. విజయవాడకు వెళ్లిన వారిలో లక్కిరెడ్డిపల్లె తాలుకా ఏపీఎన్జీఓ అధ్యక్షుడు కె.బలరామరాజు, కార్యదర్శి మల్లిరెడ్డి, ఎన్జీఓ నాయకులు రామకృష్ణ, దేవదానం, విశ్వనాథ, రవికుమార్, ఉమెన్ వింగ్ జిల్లా అధ్యక్షురాలు శాంతమ్మ, లక్కిరెడ్డిపల్లి తాలుకా పరిధిలోని గాలివీడు, రామాపురం, లక్కిరెడ్డిపల్లి, చక్రాయపేట మండలాలకు చెందిన ఎన్జీఓ నేతలు, సంఘ సభ్యులు ఉన్నారు.



విజయవాడలోని మహాసభ ప్రాంగణం వద్ద లక్కిరెడ్డిపల్లె తాలుకా ఎన్జీఓ సంఘం నేతలు